క్లుప్తంగా...

ఎన్ఎస్‌యూఐ మున్సిపల్ అధ్యక్షుడి రాజీనామా

ఘట్‌కేసర్: ఎన్ఎస్‌యూఐ మున్సిపల్ అధ్యక్షుడు చందపట్ల సాయిచరణ్‌రెడ్డి బుధవారం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా ప్రకటించారు. అనంతరం పట్టణంలో ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్‌యూఐ మున్సిపల్ అధ్యక్షుడిగా బాధ్యత అప్పగించినందుకు శాయశక్తుల సేవలు అందించానన్నారు. వ్యక్తిగత సమస్యల కారణంగా కాంగ్రెస్‌లో కొనసాగలేక పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా ప్రకటించారు.

విచారణ జరిపి చర్యలు తీసుకోండి

ఘట్‌కేసర్: పట్టణంలోని రైతు సేవా సహకార సంఘం ఎండీ, చైర్మన్‌తో కుమ్మక్కై ప్రయాణ భత్యం తీసుకుంటున్నాడని ఆరోపిస్తూ ఆ సంఘం డైరెక్టర్ ధర్మారెడ్డి నగరంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయంలో డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు బుధవారం ఫిర్యాదు అందజేశాడు. భత్యం చెల్లింపు తీర్మాణాన్ని వ్యతిరేకించినా చెల్లింపు ఆపడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమంగా ప్రయాణ భత్యం చెల్లింపును ఆపేయాలని, వారిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరాడు.

23వ వార్డులో ఆర్ఆర్ఆర్ సెంటర్ ప్రారంభం



వస్తువులను సేకరిస్తున్న కౌన్సిలర్ మహేష్

మేడ్చల్: పట్టణంలోని 23వ వార్డులో ఆర్ఆర్ఆర్(రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ సెంటర్)ను కౌన్సిలర్ కాడే మహేష్ బుధవారం ప్రారంభించారు. మేరి లైఫ్, మేరి స్వచ్ఛ షహర్‌లో భాగంగా మేడ్చల్ పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెంటర్ ఆయన ప్రారంభించారు. చెక్క వస్తువులు, సామాగ్రి, బట్టలు, పుస్తకాలు ఇతర వినియోగించని సామాగ్రి ఉన్న వారు సెంటర్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. సామాన్లను సెంటర్‌కు తీసుకువచ్చి ఇవ్వాలని ఆయన కోరారు. పర్యావరణం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్పీలు అనిత, బాలమణి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు



భోగారంలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తూ..

కీసర: అనుమతులు లేకుండా నిర్మాణాలను చేపడితే చట్టరిత్యాచర్యలు తప్పవని కీసర ఇన్‌చార్జి ఎంపీఓ నందకిషోర్, భోగారం గ్రామకార్యదర్శి దర్మగడ్డ ఉష పేర్కొన్నారు. బుధవారం భోగారం గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న ఐదు నిర్మాణాలను పంచాయతీ సిబ్బంది, ట్రాక్టర్ సహాయంతో కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలనుకునే యజమానులు పంచాయతీ నుంచి టీఎస్‌బీపాస్ నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరి

మేడ్చల్: గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం తప్పకుండా చేయాలని ఎంపీడీఓ పద్మావతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల మహిళలకు నిర్వహించిన ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు తమ ఇళ్ల ఆవరణలో ఇంకుడు గుంతలను నిర్మాణం చేసుకోవాలని సూచించారు. ఇంకుడు గుంతల నిర్మాణం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని, ఇళ్ల ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా దోహదపడతాయని, నీరు నిల్వ ఉండకపోవడం వల్ల దోమల బెడద తగ్గుతుందని అన్నారు. అన్ని గ్రామాల్లో అందరూ గుంతలు నిర్మించుకోవాలని సూచించారు.

సత్తాచాటిన నాచారం డీపీఎస్ విద్యార్థులు

మల్లాపూర్: సిరిస్ కేంబ్రిడ్జ్ పరీక్షలో ఇంటర్నేషనల్ గ్రేడ్-10లో నాచారం డీపీఎస్ విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించినట్లు ప్రిన్సిపాల్ సునీతారావు తెలిపారు. శ్రీరామ్ శ్రీగిరి, హేమంత్‌చారి, కెవిన్ విరాల్‌షా, రధితిరెడ్డి, నబ్రితా రాయికల్, కెవిన్ విరాల్‌షా, ఓంహన్సల్, కూమర స్వామి మంచి ఫలితాలు సాధించిన్నట్లు పేర్కొన్నారు. డీపీఎస్ విద్యాసంస్థల చైర్మన్ మల్కా కొమరయ్య, డైరెక్టర్ పల్లవి, సీఈఓ మల్కా యశస్వి, కేంబ్రిడ్జ్ ఇంటరేషనల్ వైస్ ప్రిన్సిపాల్ శాంతి ఆంథోనీ విద్యార్థులను అభినందించారు.

కబ్జాలు తప్ప.. రైతుల కష్టాలేం తెలుసు..?

టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్



ఏదులాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్: అన్నదాతల ఆగ్రహం టీఆర్ఎస్ ప్రభుత్వ పతనానికి నాంది అవుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఏదులాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రం కల్లాల్లో 20 రోజులుగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి మల్లారెడ్డి అబద్ధపు హామీలతో అన్నదాతలను మోసం చేస్తున్నారని, వారికి డబ్బు సంపాదించడం, భూములు కబ్జా చేయడం మినహా అన్నదాతల సమస్యలపై అవగాహన లేదన్నారు. అంకుషాపూర్‌లో కూలీలు లేక, ఏదులాబాద్‌లో తేమ పేరుతో ధాన్యం కొనుగోలు చేయడం నిలిపేశారని అన్నారు. రోజుల తరబడి ఎండలో ధాన్యం ఎండిబెడితే వర్షానికి తిరిగి తడిసి రంగు మారుతుందన్నారు. టోకన్లు ఇచ్చి ఐదు రోజులైనా ధాన్యం కొనుగోలు చేయడం లేదని, దీనిపై టీఆర్ఎస్ నాయకులు ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. నాలుగు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయాలని, లేనిపక్షంలో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ జంగమ్మ, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ఉదయ్‌రెడ్డి, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ రవి, భోజిరెడ్డి, సుధాకర్, శేఖర్‌రెడ్డి, విశ్వనాథం, నర్సింగ్‌రావు ముదిరాజ్, రమేష్, సురేష్, శంకర్, రాజేందర్‌గౌడ్, సత్తయ్యముదిరాజ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ గీత, ఉపసర్పంచ్ సత్యనారయణ

సీఎం నుంచి ప్రశంసలు

మేడ్చల్: మండలంలోని డబీల్‌పూర్ గ్రామానికి ఉత్తమ బీఎంసీ అవార్డు లభించింది. అవార్డు సాధించిన గ్రామ పంచాయతీ సర్పంచ్ గీత భాగ్యారెడ్డి, ఉపసర్పంచ్ సత్యనారాయణ మంత్రి మల్లారెడ్డితో కలిసి మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సచివాలయంలో కలవగా ఆయన అవార్డులను, ప్రశంసా పత్రాలను చూసి అభినందించి వాటిని అందజేశారు.

మేడ్చల్‌లో సన్మానం..

బీఎంసీ అవార్డు సాధించిన డబీల్‌పూర్ గ్రామ సర్పంచ్ గీత భాగ్యరెడ్డిని మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజారెడ్డి, ఎంపీడీఓ పద్మావతి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు గీతను ఘనంగా సన్మానించి అభినందించి ప్రశంసించారు.



మేడ్చల్‌లో సర్పంచ్ గీతను సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్

30 నుంచి బ్రహ్మోత్సవ వేడుకలు

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబదేవి 17వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 30 నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు శ్రీమాతా నిమిషాంబదేవి ఆలయం, గణపతి, శివాలయం, శ్రీరామపరివార, ఆంజనేయ, దత్తాత్రేయ, సాయిబాబా, నవగ్రహ, సర్ప ఉపాలయాల బ్రహ్మోత్సవాల వేడుకలు జరుగుతాయన్నారు. ఈ నెల 30వ తేదీన సుప్రభాతం, దేవతా ప్రార్థన, గోపూజ, శాంతి మంత్ర పఠనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపస్థాపన, అగ్నిస్థాపన జరుగుతుందన్నారు. అలాగే 31వ తేదీన గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండప దేవతాపూజలు, శ్రీచక్రార్చన, మండప ఆరాధన, గురువుగారిచే ప్రవచనం, మంత్ర పుష్పం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అలాగే జూన్ 1వ తేదీన గణపతి పూజ, ఆవాహిత దేవత హోమం, బలిప్రధానం, పూర్ణాహుతి, ఉదయం 9గంటలకు అమ్మవారికి పంచామృత, 56 రకాల పండ్ల రసాలతో సుగంధ ద్రవ్యాలతో నిజాభిషేకం, విశేష అలంకరణ, పంచ హారతులు, రుత్విక్ సన్మానం, పల్లకీ సేవ, సామూహిక ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

సీఎం కప్ విజేతలకు సన్మానం



సీఎం కప్ విజేత కబడ్డీ, వాలీబాల్ క్రీడాకారులతో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: హకీంపేట్‌లోని స్పోర్ట్స్ స్కూల్లో జరిగిన జిల్లాస్థాయి సీఎం కప్-2023 క్రీడల్లో ఘట్‌కేసర్ మండలం కబడ్డీ, వాలీబాల్ జట్లు విజేతలుగా నిలిచాయి. ఈ సందర్భంగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయా జట్ల క్రీడాకారులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాలకు క్రీడా సామాగ్రి అందజేశామన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లింగేశ్వర్‌రావు, ఎంపీటీసీ రవి, ఎస్సై జ్ఞానేందర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి, యుగేందర్‌గౌడ్, కబడ్డీ, వాలీబాల్ జిల్లా విజేతలు పాల్గొన్నారు.

చిలుకానగర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి



ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ అభివృద్ధికి మరిన్ని నిధులను కేటాయించాలని కోరుతూ బుధవారం చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈస్ట్ కళ్యాణపురి కమ్యూనిటీ హాల్ పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు సీతారామ కాలనీలో వరద నీటి పైపులైన్ పనులకు తవ్విన రోడ్ల మరమ్మతులు, కుమ్మరి సంఘం శ్మశానవాటికలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులను మంజూరు చేయాల్సిందిగా కోరారు. జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, నారాయణరెడ్డి, ఎండీ మహ్మమూద్, షఫీ, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు భరించలేక గృహిణి ఆత్మహత్య

ఉప్పల్: భర్త వేధింపులు భరించలేక గృహిణి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ప్రకాశం జిల్లాకు చెందిన ప్రేమ్‌కుమార్ మేనమామ కూతురు మౌనిక(21)ను వివాహం చేసుకున్నాడు. అక్కడి నుంచి బతుకు దెరువుకోసం నగరానికి వచ్చి చిలుకానగర్‌లో నివాసముంటూ పెయింటర్‌గా పని చేస్తున్నాడు. వీరికి 14 నెలల బాబు ఉన్నాడు. కొంతకాలంగా ప్రేమ్‌కుమార్ మద్యానికి బానిసై ప్రతిరోజూ మద్యం తాగి వచ్చి భార్యను హింసించేవాడు. దీంతో అతడి బాధను తట్టుకోలేక మంగళవారం రాత్రి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బుధవారం ఉదయం స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. మౌనిక తల్లి దండ్రుల ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేదింటి యువతి వివాహానికి ఆర్థిక సాయం

ఘట్‌కేసర్: పేదింటి యువతి వివాహానికి అవుషాపూర్ సర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డి దంపతులు బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన అంజమ్మ హనుమంతు దంపతుల నివాసానికి వెళ్లి నూతన వధువును ఆశీర్వదించారు. అనంతరం రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్, వధువు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మైనంపల్లి త్వరగా కోలుకోవాలని పూజలు

అల్వాల్: ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు త్వరగా కోలుకొని ప్రజలకు అందుబాటులోకి రావాలని కోరుతూ బుధవారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుక్మిణి ఎన్‌క్లేవ్ శివంబావి వద్ద ఉన్న శ్రీశివాంబిక సంకటహర గణపతి శ్రీఅభయాంజనేయ ఆలయంలో పార్టీ శ్రేణులతో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

కాప్రా ఎల్లారెడ్డిగూడ రహదారి పాక్షికంగా బంద్

కాప్రా: కాప్రా నుంచి ఎల్లారెడ్డిగూడ రహదారిలో దాబా గార్డెన్ వద్ద నాలా బ్రిడ్జి పునర్నిర్మాణ పనులు ప్రారంభమైనందున ఈ రహదారిని పాక్షికంగా మూసివేయనున్నట్లు జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శంకర్ తెలిపారు. ఈ రహదారి మీదుగా వెళ్లే వారు కాప్రా తహసీల్దార్ కార్యాలయం నుంచి సాకేత్ రోడ్డు, అరుణ్‌నగర్ కాలనీ నుంచి సాకేత్ రోడ్డు, ఎల్లారెడ్డిగూడ పద్మారావు నగర్ నుంచి సాకేత్ రోడ్డు, ఎల్లారెడ్డిగూడ చౌరస్తా నుంచి సాకేత్ రోడ్డు విద్యాభారతి స్కూల్ దారిలో ప్రయాణించాలని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

మరకత శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో పూజలు

అల్వాల్: కానాజీగూడలోని మరకత శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో బుధవారం విశేష పూజలు, విశిష్ట అభిషేకాలు, 32 ఔషదీకృత ద్రవ్యాలతో అభిషేకాలు, లక్ష్మీ గణపతి మాల మంత్రము, మరకత శ్రీమహాలక్ష్మీ హోమాలను నిర్వహించారు. ప్రతిరోజూ నగరంలో నిర్వహించే అన్నప్రసాద వితరణకు విరాళాలు అందజేయాలని ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణశాస్త్రీ అన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి



మల్లేష్ (ఫైల్)

కీసర: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన భోగారం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం భోగారం గ్రామానికి చెందిన చుంచు మల్లేష్(41) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. మంగళవారం రాత్రి 6.30 గంటలకు భోగారం గ్రామ రెవెన్యూ పరిధిలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం నుంచి ద్విచక్రవాహనంపై ఇంటి వస్తుండగా భోగారం గ్రామానికి సమీపంలో కుక్క అడ్డురావడంతో ద్విచక్రవాహనం పైనుంచి మల్లేష్ కింద పడిపోయాడు. తల, ముక్కుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మల్లేష్ మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన మల్లేష్ మృతి చెందడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మల్లేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

బోడుప్పల్‌లో సమ్మర్ క్యాంప్

బోడుప్పల్: బోడుప్పల్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న సహస్ర అకాడమీ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కె.నరేష్ ఒక ప్రకటనలో వెల్లడించారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు బేసిక్స్, స్పీడ్ మేథ్స్, అబాకస్, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఐఐటీ ఫౌండేషన్, 4, 5, 7, 8 తరగతి విద్యార్థులకు నవోదయ, సైనిక స్కూల్ కోచింగ్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఫోన్: 99669 23404.

ఎస్ఎంసీ కమిటీల కాలపరిమితి పెంపు

- మన ఊరు-మనబడి పనులకు గడువు పొడగింపు
- బడుల అభివృద్ధిలో కమిటీల పాత్ర కీలకమే..
- గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో 2,497 ఎస్ఎంసీ కమిటీలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: సర్కారు బడుల అభివృద్ధిలో ఎస్ఎంసీ(పాఠశాల యాజమాన్య కమిటీ)ల పాత్ర కీలకంగా ఉంటోంది. ఈ కమిటీల ఆమోదంతోనే ప్రభుత్వ బడుల్లో అభివృద్ధి పనులు, కార్యక్రమాలు జరుగుతాయి. కీలకమైన ఈ కమిటీల గడువు ఈ నెలాఖరుతో ముగియనుండగా.. మరో ఆరు నెలలు(నవంబరు వరకు) పెంచుతూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

నిధుల వినియోగంలో కీలకం..

గ్రేటర్ హైదరాబాద్‌తో సహా శివారు జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తంగా 2,497 ఎస్ఎంసీ కమిటీలు కాగా, ఇందులో హైదరాబాద్ జిల్లాలో 631, రంగారెడ్డి జిల్లాలో 1,301, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 505 ఎస్ఎంసీ కమిటీలు ఉన్నాయి. ఒక్కో తరగతి నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు ఇద్దరిని సభ్యులుగా తీసుకుంటారు. ప్రాథమిక పాఠశాలలకు 15, ప్రాథమికోన్నతకు 22, ఉన్నత పాఠశాలలకు 9 మంది సభ్యులుగా ఉంటారు. వీరి నుంచి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. బడుల అభ్యున్నతికి వీరు క్రియాశీలకంగా వ్యవహరిస్తారు. ప్రభుత్వం కేటాయించే నిధులను చైర్మన్, ప్రధానోపాధ్యాయుడి సంయుక్త ఖాతాలో జమ చేస్తారు. కమిటీ ఆమోదంతో వీటిని ఖర్చు చేస్తారు. గతంలో మూడు నెలలకు ఒకసారి సమావేశాలు జరిగేవి. గత విద్యా సంవత్సరం నుంచి ప్రతి మూడో శనివారం నిర్వహిస్తున్నారు.

పనులు వేగవంతమయ్యేనా?

గ్రేటర్ హైదరాబాద్‌తో సహా మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో మన ఊరు- మన బడి పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. మేడ్చల్, హైదరాబాద్(ఇన్‌చార్జ్) జిల్లాల కలెక్టర్ అమయ్‌కుమార్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరిష్ పలుమార్లు సమీక్షలు నిర్వహించినా.. గాడిన పడటం లేదని తెలుస్తోంది. ఈ అభివృద్ధి పనులకు సంబంధించి ఎస్ఎంసీ కమిటీలే కీలకపాత్ర పోషిస్తున్నాయి. మన ఊరు-మన బస్తీ-మనబడి కార్యక్రమం కింద రూ.30 లక్షలలోపు పనులను కమిటీల ఆమోదంతో నామినేషన్ పద్ధతిలో కేటాయించారు. రూ.30 లక్షలకు పైగా నిధులున్నవి టెండర్ల ద్వారా చేపడుతున్నారు. మన ఊరు-మన బడి పనులకు ఆటంకం కలగవద్దనే ఉద్దేశ్యంతో కమిటీలకు ఈ నెలాఖరు వరకు ఉన్న గడువును నవంబరు 30 వరకు పెంచుతూ పాఠశాల డైరెక్టరేట్ ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా విద్యాశాఖ వర్గాలు పేర్కొన్నాయి.

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రజితరెడ్డి

మేడ్చల్: రాష్ట్రం అవతరించి 10 ఏళ్లు గడుస్తున్న సందర్భంగా ప్రభుత్వం తరఫున నిర్వహిస్తున్న అవతరణ దశాబ్ది ఉత్సవాలను గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అవతరణ ఉత్సవాలపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జూన్ 2 నుంచి 22 వరకు గ్రామాల్లో అవతరణ వేడుకలను ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం వైభవంగా నిర్వహించాలని అన్నారు. గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలను భాగస్వాములు చేసి ఉత్సవాలను నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ శైలజవిజయానంద్‌రెడ్డి, ఎంపీడీఓ పద్మావతి, వైస్‌ఎంపీపీ వెంకటేషం, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు



కీసరలో సీడ్స్ దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

కీసర: మండలంలోని వివిధ గ్రామాల్లోని విత్తన, ఫర్టిలైజర్స్ దుకాణాల్లో జిల్లాస్థాయి విత్తన టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం మండల కేంద్రమైన కీసరలోని షేక్‌చంద్, ఓంశ్రీసాయి సీడ్స్, ధనలక్ష్మీ సీడ్స్ దుకాణాల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మేడ్చల్ ఏడీఏ వెంకట్‌రామ్‌రెడ్డి, మాట్లాడుతూ రైతులకు నాణ్యత కలిగిన విత్తనాలను అందించాలనే ప్రభుత్వ విధానంలో భాగంగా సీడ్స్ దుకాణాల్లో ఈ తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. ఎవరైనా కల్తీ విత్తనాలు తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. రైతులు విత్తనాలు తీసుకున్నప్పుడు తప్పకుండా బిల్ తీసుకోవాలని, ఆ బిల్లును రైతులు తమ పంట కాలం వరకు భద్రపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మల్కాజ్‌గిరి డీఏ రవిబాబు, మండల వ్యవసాయాధికారి మాధవిలత తదితరులు పాల్గొన్నారు.

మహిళను కాపాడిన పోలీసులు



మహిళను కాపాడిన జవహర్‌నగర్ పోలీసులు

జవహర్‌నగర్: ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళ ప్రాణాలను పోలీసులు కాపాడిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ బీజేఆర్‌నగర్‌కు చెందిన రచన(30) భర్తతో విభేదాలు ఏర్పడి మూడేళ్లుగా తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. బుధవారం రచన బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడటంతో కుటుంబసభ్యులు 100కు ఫోన్ చేశారు. వెంటనే స్పందించిన పెట్రోలింగ్ పోలీసులు ఎండీ ఇంతియాజ్ హుటాహుటిన 2 నిమిషాల్లో ఘటన స్థలానికి చేరుకొని ఇంటి తలుపులు పగులగొట్టి రచనను దించి ఆస్పత్రికి తరలించారు. ఆమె క్షేమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. మహిళ ప్రాణాలను కాపాడిన పోలీసులను కాలనీవాసులు అభినందించారు.

జోరుగా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, కౌన్సిలర్ మల్లేశ్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ 11, 12వ వార్డులో బుధవారం చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను చైర్ పర్సన్ పావనీయాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రజలు అనారోగ్యానికి గురికావొద్దని, వీధులు, రోడ్డుకు ఇరువైపులా, కాల్వల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేయిస్తున్నామన్నారు. స్వచ్ఛ్ భారత్‌లో భాగంగా బోర్లు, కుళాయిల వద్ద దోమలు పెరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. తాగు నీరు కలుషితం కాకుండా, అంటు వ్యాధులు పంజా విసరకుండా ఫాగింగ్ చేయించామని, దోమ లార్వాలు అభివృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లేశ్, పద్మారావు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.